# మురిపెం వెల మూడు వేలు!

నిలువుటద్దం ముందు నుంచుని, ఓ చేత్తో మరో అద్దాన్ని వెనక్కి పట్టుకొని, సిగమీద మల్లె చెండుని ఇంకో చేత్తో సరిజేసుకుంటూ "ఏవండీ! నేను రెడీ. మీరు రెడీయా?" అంది పడకగదిలోంచి సుశీల.

హాల్లో సోఫామీద తాపీగా కూర్చుని పేపరు చదువుకుంటూన్న శివరావు, తుపాకీ గుండు వచ్చి ఒళ్లో పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు ఆ కేకతో.

పొద్దున్న, ఇంకాతను నిద్దర లేవకముందే వచ్చి, మంచం పట్టె మీద కూర్చుని, క్రాఫ్ సరిజేస్తూ "బారెడు పొద్దెక్కింది - కాఫీ చల్లారిపోతోంది అబ్బ! లేవండీ!" అని గోముగా లేపుతూ సుప్రభాతం పాడినప్పుడే అర్థం అయింది,ఇవాళ ఏదో కొంపమునగ బోతోందని.

ఆఫీసుకి వెళ్ళబోయే ముందు, చొక్కాబొత్తాముల్ని ఉత్తి పుణ్యానికే సుతారంగా సర్దుతూ "సాయంత్రం పెందరాళే వస్తారుకదూ?"అని అడిగినప్పుడు, పొద్దుటి అనుమానం కాస్తా స్థిరం అయిపోయింది.

అక్కడికీ భయం భయంగానే వచ్చాడు ఇంటికి -

ఎప్పుడూ లేంది, ఎదురొచ్చి చిరునవ్వు నవ్వుతూ "వచ్చారా? కాళ్ళుకడుక్కోండి. టిఫెన్ పెడతాను" అన్నప్పుడు 'ఓరి బాబోయ్!' అనుకున్నాడు శివరావు. టిఫెన్ అంటోందంటే, ఏదో పెద్ద ప్రమాదమే.

అయిష్టంగా కొద్దిగా కతికి, టిఫెన్ అయిందనిపించి, నీరసంగా సోఫాలో కూలబడ్డాడు శివరావు; అంతకంటే చేయగలిగింది లేదు -

మామూలుగా కంటే కాస్త జోరుగా భార్య మేకప్ అవుతోందంటేనే అర్థం అయిపోవాలి, ఏ మాత్రం ఇంగిత జ్ఞానం ఉన్న భర్తకేనా - తనకి ఏమూలో అది ఉన్నట్లు అనుమానం శివరావుకి - అందుకే అర్థం అయిపోయింది. అరగంట నుంచి సుశీల అద్దం ముందు కూర్చుని ముస్తాబవుతోంది. అంటే?

ఇంకేం ఉంది? గోవింద! తన పర్సుకి కాళ్ళు వచ్చాయి. ఇవాళే మూడు వేల

రెండు వందలరూపాయల జీతం తీసుకొని బరువెక్కిన తన బంగారు పర్సుకి (అఫ్‌కోర్స్. పర్సులు బంగారంతో చెయ్యరనుకోండి)

పైగా యుద్ధానికి పిలుస్తున్నట్లు పిలుపొకటి "నేను రెడీ మీరు రెడీయా?" అంటూ.

ప్రతిపక్షం పూరించిన శంఖారావం అది!

"ఇప్పుడు నేను అన్ రెడీ. యుద్ధం చెయ్యను, చెయ్యలేను" అంటూ తప్పించుకోడానికి వీల్లేదు! ఏవంటే, పొద్దుటి నుంచీ సుశీల పకడ్బందీగా, కదనరంగానికి రంగం సిద్ధం చేసేసింది. తల వంచాల్సిందే. తప్పించుకోడానికి వీల్లేదు.

"మీ డ్రెస్ తీసి, పరుపు మీద పెట్టాను. లేచి మొహం రుద్దుకుని వేసుకోండి"

అలా అంటే, 'తక్షణమే లెండి' అన్న అల్టిమేటమే. శివరావుకి తెలుసు పూర్వానుభవాల కారణంగా. అందుకే తటాలున లేచాడు.

తీరా పరుపు దగ్గరికి వెళ్లేటప్పటికి పట్టరాని దుఃఖం ముంచుకొచ్చింది. ఎందువల్లో ఈ కాంబినేషన్ అంటే మహా సరదా సుశీలకి - తనకి ప్రత్యేకంగా ఇవే సెలెక్ట్ చేసి ఉంచుతుంది, ప్రతి ముఖ్యమైన సందర్భంలోనూ.

నీలం పేంటూ!

ఎర్ర షర్టూ!

బస్సు స్టాండులోనో, రైల్వే ప్లాట్‌ఫారమ్ మీదో, రెడీగా నుంచున్నట్టు అనిపించింది శివరావుకి. వేసుకోనంటే, ఎందుకు వేసుకోరు అంటూ వాదనలోకి దిగుతుంది. ఇదీ విషయం అని ఎలా చెప్తాడు - ఉన్న ఇబ్బందిని తనా చెప్పలేడు - ఆమే అర్థం చేసుకోదు - కాదంటే ఖరారు చేసి తీరుతుంది. వాదిస్తే ఓడిపోవడం ఖాయం. చివరకి తలవంచడం కంటే, ముందే తల ఊచడం మంచిది.

మరో పదినిమిషాలకి మెయిన్ రోడ్ కలకల్లాడి పోయింది, సుశీలా శివరావుల వంటి ముచ్చటైన జంటలతో మురిపాలొలికిస్తూ.

వేనిటీ బేగ్‌ని వేళ్ల మధ్య సుదర్శన చక్రంలా విలాసంగా తిప్పుతూ, కృష్ణుడి చేతిలో చక్రాన్ని ఊళ్ళాక్కుని నరకాసురుడి మీదకి ఉరుకు తూన్న సత్య భామలా, షాపింగ్‌కి బయలు దేరిన సుశీలమ్మగారు ముందూ,రెండు చేతుల్లోనూ రెండు కాళీ బేగ్‌లూ పట్టుకుని, ఉక్రోషంతో ఎరుపెక్కిన ముఖం, తొడుక్కున్న ఎర్రచొక్కాతో పోటీ పడుతూంటే, నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ భర్తగా పిలవబడుతూన్న శివరావు, ఆమె వెనకాలా, చూడముచ్చటగా నడుస్తున్నారు. షాపు యజమానులకళ్ళల్లో ఆశలూ, చూసేవాళ్ళ కళ్ళల్లో ఆనందాలూ, వెల్లివిరిసి పోతున్నాయి, ఆ అపురూపమైన జంటని చూసే సరికి.

రకరకాల రంగుల ప్లాస్టిక్ సామాన్లు అందంగా వేళ్ళాడదీసిన ఓ షాపు దగ్గర ఆగింది సుశీల.

"ఇంతకంటే పెద్ద సైజు టబ్ లేదా? ఈ బకెట్లు మరీ నాసిరకంవిలా ఉన్నాయి. మంచివి చూపించండి. ఈ మధ్యన ప్లాస్టిక్ పీటలు వస్తున్నాయట. మీ దగ్గర ఉన్నాయా?" వంటి సవాలక్ష ప్రశ్నలు వేస్తూ, సడన్‌గా షాపులోకి ప్రవేశించి రకరకాల వాకబులతో ఠారెత్తించే, సేల్స్ టాక్స్ ఆఫీసరులా ఆమె ఎడాపెడా చెడుగుడు ఆడేస్తూంటే, షాపు యజమాని వినయంగా చేతులు కట్టుకుని సమాధానం చెప్తున్నాడు. వినయమే మరి! ఆమె దూకుడు చూస్తూంటే షాపు అంతా కొనేసేలా ఉంది - సుశీలకీ, షాపు యజమానికీ మధ్య ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఖరాగా ఓ గంట సాగింది.

చివరకి ఓ టబ్, ఓ చిన్న ప్లాస్టిక్ చెంచా కొని, డబ్బులిచ్చి సరుకుతీసుకోమని భర్తకి పురమాయించి, రోడ్డుమీదకి నడిచింది సుశీల. 'ఈ చిన్న బేరమేనా?' అన్న నిరాశ, కొట్టు యజమాని కళ్ళల్లోనూ, తేలిక లోనే తేల్చేసింది అన్న కృతజ్ఞత శివరావు ముఖంలోనూ,స్పష్టంగా కనిపించింది -

వేనిటీ బేగ్ విలాసంగా ఊపుకుంటూ, గాలిలో తేలిపోతున్నట్లు నడిచి వస్తూన్న సుశీల, రాజ దర్బారులోకి ప్రవేశిస్తూన్న మహారాణిలా ఉంది. 'ఏంకావాలమ్మా' 'రండిదయచేయండి', 'అన్నీ ఉన్నాయి మన కొట్లో', 'నమస్కారం అమ్మా' అంటూ రోడ్డుకి ఇటూ అటూ ఉన్న షాపుల తాలూకు యజమానులు, బారులు తీర్చి బరాబరులు చేసే సామంత, దండనాయక, వంది, మాగధ పరివారంలా ఉన్నారు. అందరి నమస్కారాల్నీ చిరునవ్వుల్తో స్వీకరిస్తూ, కొందరిని మాత్రం సరుకులు కొని ఆదరిస్తూ, కొన్న ప్రతివస్తువునీ వెనకాలే వస్తూన్న శివరావుకి అందిస్తూ, ఆరాస్తా మీద రాజహంసలా ముందుకి కదులుతోంది సుశీల.

షాపింగ్ చెయ్యడానికి బయలుదేరే ముందు, ఫలానా ఫలానా వస్తువులు కొనాలని ఓ లిస్టు రాసుకుని మరీ వెళ్ళడం, సుశీల వంటికి పడదు. ఆ పద్ధతి అంటే అసహ్యం కూడా - అవసరం అయిన వస్తువో, కాదో - కొనాలనిపిస్తే, కొనెయ్యడమే! తర్జన భర్జనలకి తావు లేదు. టి.వీ. ఉంటేనే వి.సి.ఆర్ కొనాలనీ, సోఫా ఉంటేనే సోఫా కవరు కొనాలనీ, చాదస్తం ఆమెకిలేదు. షాపింగ్ అనేది ఆశుపద్యంలా సాగాలనీ, అందుకోసం ఆలోచనా, అవసరం, అనే హద్దులు ఏర్పరుచు కోకూడదనీ, సుశీల సిద్ధాంతం.

అందుకే ఆమె, శివరావులా ఆలోచనల భారంతో కాకుండా, హాయిగా నడుస్తోంది. ఉద్యానవనంలో విహరిస్తూ, ఆ చేత్తో ఓ గులాబీ, ఈ చేత్తో ఓ సంపెంగా, అలా ఓ చెంగల్వా ఇలా ఓ చేమంతీ అందుకొని, వెనకాల ఉన్న చెలికత్తెకి అందిస్తున్నట్లు, ఆ కొట్లోంచి ఓ ఫ్లవర్ వాజా, ఈ కొట్లోంచి ఓ ఫ్లాస్కూ, ఆషాపులోంచి ఓ మెత్తని చీపురూ, ఈషాపులోంచి ఓ బూజు దులుపుకొనే కర్రా అందుకుంటూ, వాటిని వెనకాలే వస్తూన్న శివరావుకి అందిస్తూ ముందుకి సాగిపోతోంది.

'సుశీలా! ఈ వస్తువు మనకి అక్కర్లేదేమో!' అని తెగించి అనలేకా, అలాగని అనవసరం అయిన వస్తువులనిమిత్తం షాపుల వాళ్ళకి డబ్బులు సమర్పించుకోలేకా, రకరకాల సైజులున్న సరుకుల్ని తను మోసుకొస్తూన్న టబ్‌లో వేయ్యలేక అలాగని అన్నీ చేత్తో పట్టుకోనూలేక సతమతమవుతూ, బాగా ముందుకెళ్ళి పోయిన సుశీలని అందుకోడానికి, పరుగు లాంటి నడకని ఆచరణలో పెడుతూ, విచిత్రమైన భంగిమలో నడుస్తున్నాడు శివరావు.

"ఈ సరంజామా అంతా ఏవిటోయ్ శివరావ్?"

"ఇప్పుడు నీకు ఫోటో తియ్యాలయ్యా! నెత్తిమీద ఆ నీళ్ళటబ్! ఓ చేతిలో ఢమరుకంలా ఆఫ్లవర్‌వాజా! మరో చేతిలో త్రిశూలంలా బూజుదులిపే ఆ కర్రా! - ఓహ్! సాక్షాత్తూ సదాశివుడిలా..."

"ఆ వేనిటీ బేగ్ సుందరి వెనకాల ఈసామాన్లతో నువ్వేమిటి? ఓహో ... సారీ సరేసరే"

అంటూ దారిలో ఒకళ్ళిద్దరు స్నేహితులు శివరావుని పలకరించకపోలేదు. అయితే, సమయానుకూలంగా ఓ చిరునవ్వూ, కళ్ళచికిలింపూ, తలాడించడం వంటి గడుసు సంజ్ఞలు కొన్ని చేసి, ఆప్రమాదాలనుంచి తప్పించుకున్నాడు.

సుశీల షాపింగ్ యాత్ర సాగుతోంది.

క్రమేపీ శివరావు మోసే సరుకుల బరువు పెరిగి, పర్స్ బరువు తగ్గుతోంది-

ఆమె అడుగులు చురుగ్గా - అతని నడక భారంగా బరువుగా-

సుశీల ఓ మారు వెనక్కి తిరిగి చూసింది - పతి దేవుడి పరిదేవనని గ్రహించింది. - జాలి పడింది - "అయిపోయిందండీ - ప్లీజ్ - ఇంకొక్కషాపు - తర్వాత ఆటో ఒకటి చూసుకొని ఇంటికి వెళ్ళిపోదాం-"

ఆ మాటలో ఎంతో ఓదార్పూ - ఇంతవరకూ ఆటో కట్టించక పోవడానికి ఇచ్చుకున్న సంజాయిషీ, రెండూ ధ్వనించాయి.

నిజమే మరి!

ఇలా ప్రతిషాపు దగ్గరా ఆగుతూ, బేరాలు చేస్తూ, ఒక్కొక్క వస్తువే చేరుస్తాం, ఈ రెండు మూడు గంటలూ మా వెనకాలే తిరగమంటే, ఏ ఆటో వాడు ఒప్పుకుంటాడు? భర్త కనకసరిపోయింది -

శివరావుకి సబబుగానే తోచింది - అయినా ఒక్క షాపేకదా? వైకుంఠపాళీ చివరి గడికి చేరుకున్నాం - మనస్సు సరిపెట్టుకున్నాడు.

ఓహ్! ఏం షాపు! రకరకాల కంచిబెనారస్ పట్టుచీరలతో, రంగురంగుల విద్యుద్దీపాలతో, వచ్చే వనితలకి ఆహ్వానం పలుకుతూ, వెళ్ళే అంగనామణులకు వీడ్కోలు చెబుతూ చైతన్యమూర్తులుగా కదులుతూన్న పరిజన పరివారంతో, ఆ చీరల దుకాణం కలియుగ వైకుంఠంలా ఉంది.

షాపింగ్ చెయ్యడానికి వచ్చిన శ్రీమంతుల కారులు బారులు తీర్చి షాపు ముందున్నాయి. వీరిహడావిడిలో తమని పట్టించుకుంటారా షాపు వాళ్ళు? తనుకారులో రానందుకూ, తనకి కనీసం ఒక డొక్కు కారైనా లేనందుకూ చాలా కించ పడిపోయింది సుశీల. వెనక్కి తిరిగి వెళ్ళిపోదాం అనుకొంది కూడా - కాని ఆ షాపు తాలూకు మనుష్యులు రాజకీయ పార్టీల వాళ్ళలా కాకుండా, సమసమాజం పట్ల త్రికరణ శుద్ధిగా నమ్మకం ఉన్న వాళ్ళలా ఉన్నారు. అందుకే వారిలో ఒకళ్ళిద్దరు, రండి అమ్మగారూ! రండి' అంటూ సుశీలకి స్వాగత సత్కారాలు జరిపారు.

వాళ్ళముఖాలు చూస్తే వాళ్ళమనస్సులో భావాలు తెలిసి పోతున్నాయి.

పాలకడలిలోంచి వాళ్ళ పట్టుచీరల షాపులోకి తిన్నగా నడిచి వచ్చిన సాక్షాత్తూలక్ష్మీ దేవి లాగ ఆమే, తమకి పూర్వ జన్మలో ఏదో కొంత బాకీ ఉండి, అది ఈ జన్మలో తీర్చడానికి ఈ రూపంలో వచ్చిన పాత బాకీ దారుడిలా అతనూ కనిపించి ఉంటారు వాళ్ళ కళ్ళకి - కూర్చోడానికి సుశీలకి సింహాసనంలాంటి మెత్తని మెరిసిపోతూన్న స్టూలు చూపించారు. వద్దు వద్దంటున్నా వినకుండా కాఫీ తెప్పించారు. శివరావు మాత్రం ఓ కర్ర స్టూలు లాక్కుని కూర్చున్నాడు. తలుపు పక్కనున్న కూజా లోంచి మంచి నీళ్ళు వంచుకొని తాగాడు -

రేక్‌లలోంచి చీరలు తీసి గుట్టలుగా పోసి, ఒక్కొక్క చీర మడతే విడదీసి, ఆ చీర తాలూకు ప్రత్యేకతా, దాని జరీకి గల నాణ్యతా, పైట చెంగులో విశిష్టతా విడమర్చి సుశీలకి చెబుతున్నాడు ఓ షాపు కుర్రాడు. అలా ఒక్క సుశీల పట్లే కాదు - వచ్చిన వనితల అందరి పట్లా అదే శ్రద్ధ చూపిస్తున్నారు కొట్లో కుర్రాళ్ళు. షాపంతా, రకరకాల సుందరాంగులతో, వారి కబుర్లతో, వారి బేరాలతో, మల్లెలూ మందారాలూ,

సంపెంగలూ సన్నజాజులూ కలకూజితాలు నేర్చుకుని కదలాడుతూన్న పెళ్ళి పందిరిలా ఉంది.

సుశీల ఒక్కొక్క చీరతీసి బేరం ఆడుతూంటే, శివరావుకి ఒక్కొక్క ప్రాణం జారిపోతోంది.

చివరికి ఏ చీర ఖాయం చేస్తుందో! అది ఎంత ఖరీదులో ఉంటుందో-

శివరావు ప్రాణాలుగ్గబెట్టి, బితుకూ బితుకూ మంటూ బిగిసిపోయి కూర్చున్నాడు. తనలాగే మరోనలుగురైదుగురు మగమహారాజులు కూడా నిలువెల్లా వణికిపోతూ కనిపించారు.

ఆ అయిదారుగురూ తప్ప తక్కిన వాళ్ళంతా హాయిగానే ఉన్నారు.

కొనే కోమలాంగులు కలకల నవ్వుతున్నారు.

అమ్మే అబ్బాయిలు హాస చంద్రికలు వెలారుస్తున్నారు. నవ్వుల పందిరిలా ఉన్న ఆ షాపులో, శివరావుతో బాటు ఆనలుగురైదుగురి ముఖాలే వెలవెల బోతున్నాయి.

ఎన్ని చీరలు చూపించాడు!

ఎంత మర్యాద చేశాడు!

చివరకి ఓ చవకరకం చీరకొంటే ఏం బాగుంటుంది అని ఇబ్బంది పడసాగింది సుశీల. ఆమె మనస్సులో భావాన్ని చదివేశాడో ఏమో "ఇది లేటెస్ట్ ఫేషన్ అమ్మగారూ! ఇప్పుడంతా ఇవే కడుతున్నారు. వంద తెప్పించాం. అయిదు మిగిలాయి. ఈ సంపెంగ రంగు చీర మీకు బాగా సరిపోతుంది" అంటూ షాపు కుర్రాడు సుశీలని తెలివిగా మొహమాటంలో పెట్టేశాడు. ఆమె సరే అంది. ఆమె సూచన ప్రకారం, ఆ అబ్బాయి చీరని అందమైన బేగ్‌లో పెట్టి, బేగ్‌తో బాటు బిల్లు కూడా శివరావు చేతిలో పెట్టాడు.

బేగ్ చూస్తే శివరావుకి కళ్ళు మిరుమిట్లు గొలిపాయి కాని, బిల్లు చూసే సరికి చీకట్లు కమ్మాయి.

అన్నీ కొనే సరికి పర్స్‌లో మిగిలినవి రెండు వేల అయిదు వందలు. ఈ షాపు వాడికి ఎక్స్‌రేకళ్ళు ఉన్నాయేమో. సరిఘ్ఘా రెండువేల నాలుగువందల యాభయికి బిల్లుఇచ్చాడు - మిగిలిన యాభయి లోనూ ఆటో రిక్షా ఖర్చులూ వగైరా సర్దుకో బాబూ అని దయ తలచి వదిలేసినట్లు.

నెల జీతం అంతా ఇలా ఒక్క పూటలో, హుష్ కాకీ' అయిపోతే ఎలా?

'సుశీలా!' అంటూ ఏదో చెప్పబోయాడు శివరావు. కాని ఆమె అప్పటికే షాపు దాటి రోడ్డు మీదకి వెళ్ళి ఆటో వాడిని పిలుస్తోంది.

అంతా అయిపోయింది. చెయ్యి దాటిపోయింది మరో మార్గాంతరం లేదు. శివరావు బిక్క మొహంవేసుకుని బిల్లు కేసి చూశాడు.

ఎదురుగా షాపు కుర్రాడు నక్షత్రకుడిలా నిలబడ్డాడు.

ఆవు దగ్గర్నుంచి దూడని లాక్కుపోయినట్లు శివరావు దగ్గర్నుంచి రొఖ్ఖంలాక్కుపోయాడు షాపు బోయ్. సాధుజంతువు - గుంజకి కట్టబడ్డనిస్సహాయజీవి - గుంజ చుట్టూ అలంగం తిరగడం తప్ప ఏం చెయ్యగలదు? శివరావుకి కాస్సేపు అలా అలంగం తిరగడానికి కూడా వీల్లేదు - అవతల సుశీల పిలుస్తోంది.

సకల సంబారాలూ మోసుకొచ్చి 'హమ్మయ్య' అంటూ, సీటులో సుశీల పక్క ఇరుక్కుని కూర్చున్నాడో లేదో, ఆటో బయలు దేరింది.

అప్పటికి తీరిక చిక్కింది సుశీలకి భర్తకేసి చూడ్డానికి - చూసి గతుక్కుమంది.

"అదేవిటండీ అలా ఉన్నారు, పది లంఖణాలు చేసినట్టు?" అంటూ ఆశ్చర్యపోతూ అడిగింది.

"ఏం - బాగానే ఉన్నానే!" అంటూ వెర్రినవ్వు ఒకటి నవ్వాడు శివరావు.

"చీరల షాపువాడు పాపం మంచి వాడండీ! మూడు వేల రూపాయల చీరని, ముష్టి రెండు వేల నాలుగు వందల యాభయికి ఇచ్చాడు. ముందు తగ్గనన్నాడు తెల్సా?" కళ్ళు ఎగరేస్తూ చెప్పింది సుశీల.

"తగ్గక ఏం చేస్తాడు? నిన్ను చూస్తే ఎంతటి వాడయినా తగ్గవలసిందే!" నేల చూపులు చూస్తూ నెమ్మదిగా అన్నాడు శివరావు.

అది ఖచ్చితంగా తనకి కితాబే!

అతణ్ణి చూసేటప్పటికి ఆమెకి ముచ్చటేసింది.

"ఆహా! అయ్యగారికి పొగడ్డం కూడా వచ్చే!" అంటూ, మురిపాలొలికిస్తూ మృదువుగా బుగ్గగిల్లింది. అంతే!

ఆ మురిపెంలో అంత విషాదాన్నీ మరిచిపోయాడు, మూడు వేలు ఖర్చయిన బాధతోసహా.

ఖర్చుకేం ఉంది? పరిగెట్టి పారిపోదాంఅన్నా, వెనకాలే తరుముకొస్తుంది. తప్పదు. కాని, ఎన్ని వేలు ఖర్చుపెడితే మాత్రం ఈ ముద్దూ మురిపెం వస్తాయా?

ఉత్తి నోటినే ఓ మారు తృప్తిగా గుటకవేసి, 'భార్యతో' బజారుకి బాగానే ఉంది అనుకొన్నాడు శివరావు.

పాపం శివరావు!

*(1996 - స్వాతి)*